‘గోవులను రక్షిస్తామన్న సీఎం ఏం చేస్తున్నారు?’

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్



చికిత్స పొందుతున్న బీజేవైఎం నేతను పరామర్శించేందుకు వచ్చిన కుమార్‌యాదవ్

అల్విన్‌కాలనీ: మెదక్‌లో వధశాలకు అక్రమంగా రవాణా చేస్తున్న గోవులను అడ్డగించిన హిందువులపై చేసిన దాడులను ఖండిస్తున్నామని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్‌యాదవ్ అన్నారు. ఈ దాడిలో గాయపడిన బీజేవైఎం మెదక్ జిల్లా నేత అరుణ్, ఇతర నాయకులను సోమవారం వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గోవులను భక్షించే వారిని శిక్షించాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. గో ఆధారిత వ్యవసాయం ఉన్న భారతదేశంలో గోవులను పూజించి రక్షించుకోవాలన్నారు. గోవులను వధించి భుజించటం నేరమన్నారు. ఎన్నికల ముందు గోవులను రక్షిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి గోవులను గోవధశాలకు తరలిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ ఎంఐఎం పార్టీకి భయపడి వారి కనుసన్నలలో నడుస్తోందని విమర్శించారు. వెంటనే హిందువులపై దాడి చేసిన వారిని శిక్షించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.

అర్ధరాత్రి తాగునీటి సరఫరాతో ఇబ్బందులు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు

మోతీనగర్: సమయపాలన లేకుండా అల్లాపూర్ డివిజన్‌లో అర్ధరాత్రి మంచినీటిని సరఫరా చేయటం పట్ల ఐదు బస్తీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని వి. రామారావునగర్, న్యూ రామారావు నగర్, ఆర్కే నగర్, గణేష్ నగర్, హరి నగర్ బస్తీల్లో గత కొన్ని నెలల నుంచి అర్ధరాత్రి వేళల్లో మంచినీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో సాయంత్రం ఏడు గంటల లోపు మంచినీటిని సరఫరా చేసేవారని అందరికీ సౌకర్యవంతంగా ఉండేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా అసంపూర్తిగా ఉన్న నాలా నిర్మాణ పనులు పూర్తి చేస్తే రానున్న వర్షాకాలంలో ఎలాటి ఇబ్బందులు ఉండవని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నిటిపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సానుకూలంగా స్పందించారని, త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగుల సత్యం గంగపుత్ర, బి. వెంకటయాదవ్, ఆవుల సంజీవ పటేల్, రాజు, చారి, పి.ఆర్. శివ తదితరులు ఉన్నారు.

ముగిసిన శ్రీవారి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న మాధవరం కాంతరావు, పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్‌లోని భూనీల సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవ మూర్తులకు 108 కలశాల చక్రస్నానం, తిరుమంజరి సేవ, అలంకరణ, పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, సప్తవర్ణాల ధ్వజారోహణం, నివేదన, మంగళ శాసనం, ఆచార్యఋత్విక్ సన్మానం చేశారు. స్వామివారికి ఏకాంత సేవతో ఆలయ వార్షికోత్సవం ముగిసింది. కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్, గుత్తికొండ రామకృష్ణ, ఏడుకొండలు, కృష్ణ, సైదయ్య, పులిగోళ్ల శ్రీలక్ష్మీ, అంజమ్మ, ప్రకాష్‌రావు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డ్రింక్ ప్రైమ్ ప్రీమియర్ లీగ్‌లో ఫైటర్ స్టార్స్ విజయం

విజేత టీమ్‌కు లక్ష బహుమతి అందజేత

కూకట్‌పల్లి: ఇంటర్ –అపార్టుమెంట్, ఇంటర్–లోకాలిటీ క్రికెట్ టోర్నమెంట్ డ్రింక్ ప్రైమ్ ప్రీమియర్ లీగ్ 2024లో ఫైటర్ స్టార్స్ విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన ఫైటర్ స్టార్స్ జట్టుకు లక్ష బహుమతి అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అపార్టుమెంట్ కాంప్లెక్స్‌లు, క్రికెట్ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న పది జట్లు పాల్గొన్నాయి. ఫైటర్ స్టార్స్ నుంచి అమెర్ జాంటీ, సన్ రైజర్స్ ఎలెవెన్ నుంచి నితీష్ బోయా ఉత్తమ్మ బాట్స్‌మెన్, బౌలర్‌గా నిలిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా డ్రింక్ ప్రైమ్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు విజయేందర్‌రెడ్డి ముత్యాల మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో డ్రింక్ ప్రైమ్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం నిజంగా ప్రత్యేకమైందన్నారు. ఈ టోర్నమెంట్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. డ్రింక్ ప్రైమ్ కమ్యూనిటీ కోసం అద్భుతమైన ఈవెంట్‌లను ప్లాన్ చేయనున్నామని తెలిపారు. సహ వ్యవస్థాపకుడు మానస్ రంజన్ హోటా విజేత జట్టుకు అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం.. మరింత బలవర్ధకం

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు
- ఇద్దరి చొప్పున రాష్ట్ర స్థాయిలో అవగాహన కల్పించిన విద్యాశాఖ
- జిల్లా స్థాయిల్లో హెడ్మాస్టర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకూ పూర్తయిన శిక్షణ.
- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లోని సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య 3.64 లక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టిన ప్రభుత్వం బలవర్ధకమైన పోషకాహారం ఉండేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు మరింత నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించే లక్ష్యంతో విద్యాశాఖ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఏటా మార్పులు తెస్తూ.. ఇప్పటికే కోడిగుడ్డు, ఆకుకూరలు, పోషకాలు ఉంటే కిచిడీ తదితర మెనూ ప్రవేశపెట్టింది. అయితే.. వంటావార్పులో సరైన శిక్షణ లేక చిన్న చిన్న పొరపాట్లతో విద్యార్థులకు పోషకాలు అందకుండా పోతున్నాయని గ్రహించిన ప్రభుత్వం జాతీయ స్థాయిలో అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో భాగంగా ఇప్పటికే ప్రతి జిల్లా నుంచి ఇద్దరు భోజన కార్మికులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అలాగే, జిల్లా స్థాయిలో మిగతా వారందరికీ కూడా శిక్షణ పూర్తవటంతో ...విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంపైన్నే దృష్టి సారిస్తున్నారు.

- నగరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని ఇద్దరు మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు ఇద్దరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ వంట చేయడంలో ప్రావీణ్యులతో అవగాహన కల్పించగా, వారు స్థానికంగా ఉన్న వారందరికి శిక్షణ ఇచ్చారు. బియ్యం పలుమార్లు కడగడం, కూరగాయలు కోసిన తర్వాత కడగడం వల్ల ఇందులో ఉండే పోషకాలు, ఖనిజాలు నష్టపోతుండటం వల్ల తీసుకోవాల్సిన 11 జాగ్రత్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామాల్లో లభించే మునగ, తోటకూర, ఆకుకూర, కరివేపాకు, గోంగూర వంటి వాటిని ఎక్కువగా ఎలా ఉపయోగించే విషయంపై అవగాహన కల్పించారు. వంట చేసే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కార్మికుల వ్యక్తిగత శుభ్రత, నీరు, సామగ్రి, పరిసరాల పరిశుభ్రత, వడ్డనపై అవగాహన కల్పించారు.

పోషక విలువలపై దృష్టి ..

వంట నిపుణులు పేర్కొన్న పద్ధతుల ప్రకారం వంట చేయడం వల్ల పోషకాలు నష్టపోకుండా ఉంటాయని శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. . పోషకాహార లోపం వల్లే చాలా మంది పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వంట నిపుణులు చెప్పిన అంశాలు, జాగ్రత్తలు పాటిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరిస్తున్నారు. బలవర్ధకమైన ఆహారం అందించేలా చూస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య

జిల్లా	ప్రభుత్వ పాఠ శాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139

పోషకాహారంపైన్నే దృష్టి

రాష్ట్ర వ్యాప్తకంగా జిల్లాకు ఇద్దరికి మాత్రమే శిక్షణ ఇచ్చారు. వీరితో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాం. ప్రధానోపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ.. పోషకాహారం అందించేలా చూడాలని ఆదేశించాం.

–ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి



ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న బండి రమేష్



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేత చున్నూ పాషా

త్యాగానికి ప్రతీక బక్రీద్

కూకట్‌పల్లి నియోజకవర్గంలో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును డీసీపీ సత్యనారాయణ పర్యవేక్షించారు. మూసాపేటలోని జామా మసీద్ వద్దకు ఆయన చేరుకుని పరిస్థితి సమీక్షించారు. – మూసాపేట



మూసాపేటలోని జామా మసీదు వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు, పోలీసులు



బక్రీద్ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులతో మోయిజ్ తదితరులు



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

స్తుతి ఆరాధన ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలోని యునైటెడ్ ఫెలోషిప్ చర్చిలో సోమవారం ప్రార్థనలు, స్తుతి ఆరాధనలు, వాక్య పరిచర్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాస్టర్ల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, వాసుదేవరావు, పాస్టర్స్ శ్యాముల్, శ్యామ్ జాషువా, సత్యరాజు, స్టీవెన్, కోకిల శ్యాముల్, ప్రసాద్, విష్ణుకుమార్, నరసింహ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన భారీ చెట్టు కొమ్మల తొలగింపు



అవంతినగర్ తోటలో కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలో సోమవారం కురిసిన వర్షం, గాలికి మహిళా భవన్ ఎదుట భారీ వృక్షం కొమ్మ విరిగి పడింది. స్థానికులు జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. వెంటనే జీహెచ్‌ఎంసీ సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తాం



అల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న డ్రైనేజీ లైన్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తామన్నారు. కాలనీలో కొంత మేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ లైన్‌లను త్వరలో పనులు మొదటి పెట్టి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, వాసుదేవరావు, శ్యాముల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి రుద్రాక్షల అలంకారం

రాయదుర్గం: గాయత్రీదేవి జన్మదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.సోమవారం కాశీ విశ్వేశ్వరస్వామికి రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. అర్చనలు, అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కాంగ్రెస్‌లో యువతకు ప్రత్యేక స్థానం

కాంగ్రెస్ నేత శేరి సతీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: కాంగ్రెస్ కోసం కష్టపడే యువతకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నియోజవకర్గ స్థాయి, డివిజన్ల నూతన కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శులుగా జేరిపెట్టి రాజు, ఎండీ రావుఫ్, యువజన కార్యదర్శిగా వినయ్‌గౌడ్, యువజన సహాయ కార్యదర్శిగా హరి, ఫతేనగర్ డివిజన్ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాకేష్‌లను నూతనంగా నియమించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యువతను కాంగ్రెస్ ఆదరిస్తుందన్నారు. కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సహకారంతో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు కంది శ్రావణ్‌తో చర్చించి కమిటీలను వేస్తున్నామని తెలిపారు. నాయకుల సంజీవ, మైఖేల్, ఫణీంద్ర, మహిళా నాయకులు రజిత, బోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



యువజన కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేస్తున్న శేరి సతీష్ రెడ్డి, నాయకులు

రోడ్లపై వర్షపు నీరు తొలగింపు



రాయదుర్గం: భారీ వర్షం కురవడంతో పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. గచ్చిబౌలి, బయోడైవర్సిటీ పార్కు కూడలి ప్రాంతాలలో రోడ్లపై భారీ వరద పారింది. దీంతో శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఈ విశాలాక్షి, ఇతర అధికారులు, సిబ్బంది నీటిని మ్యాన్‌హోళ్ల ద్వారా నాలాలలోకి వెళ్ళేలా ఏర్పాట్లు చేశారు. అన్ని ప్రధాన కూడళ్లను అధికారులు పర్యవేక్షించారు.



వర్షంలో సరదాగా..

వర్షంలో యువకులు, చిన్నారులు క్రికెట్ ఆడుతూ సంబరపడ్డారు. భెల్ కాలనీలో సోమవారం సాయంత్రం ఒకసారిగా వర్షం కురవడంతో యువకులు ఆనందంతో ఆడుతుండగా కొంతమంది వారిని ఫొటోలు తీస్తూ కనిపించారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

నెక్టార్ గార్డెన్ వద్ద వరద సమస్య

నిలిచిన వాహనాల రాకపోకలు

గచ్చిబౌలి: వరద నీటితో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్ వద్ద వరద నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై వరద నీరు చేరడంతో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వరద నీటిని తొలగించి, వాహనాలను మళ్లించారు.



డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

కవాడిగూడ: ఫాదర్స్‌డే ను పురస్కరించుకుని రామకృష్ణ మఠంలో యోగానంద రఘుమహారాజు, నవ భారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో నాన్నపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. నాన్న మాటను అర్థం చేసుకుంటే సరైనా దారిలో నడవగలమని పేర్కొన్నారు. అనంతరం ఇందిరాపార్కులో యోగా గురువు బి. సరోజినీ రామారావు ఆధ్వర్యంలో నాన్నలను ఘనంగా సత్కరించారు.

సమాజాన్ని చైతన్యవంతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవులు, రచయితలు ఆధ్యాత్మిక రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నర్సింహ్మప్ప అన్నారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ రచయిత భువనేశ్వరి మారెపల్లి రాసిన మేఘ సందేశం పుస్తకావిష్కరణ సభ బాగ్‌లింగంపల్లిలో సోమవారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మిక నేపథ్యంలో మేఘ సందేశం పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. కుసుమ ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ మాట్లాడుతూ భారతీయ పురాణ ఇతిహాసాల సారాంశాన్ని సరళమైన భాషలో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రభ ఎడిటర్ వై.ఎస్.ఆర్.శర్మ, ప్రముఖ కవులు డాక్టర్ జల్ది విద్యాధర్, శ్రీనాథ్, డాక్టర్ కావురి శ్రీనివాస్, జి.నవీనారాణి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు బొల్లగొరి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో కామన్‌ఫీజు విధానాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎన్.బాలరాజు, జి.లింగం, చరణ్, సాయినాథ్, శివకుమార్ పాల్గొన్నారు.

కంబర్ ల్యాండ్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

అమీర్‌పేట: యూఎస్‌లోని కంబర్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.మార్క్ హాన్నా తెలిపారు. సోమవారం అమీర్‌పేట్‌లో వివరాలను వెల్లడించారు. నేడు అమీర్‌పేట ఆదిత్యపార్క్ హోటల్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని ప్రకటించారు. అధునాతన డిగ్రీ కోర్సులతో పాటు మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, ఐటీ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు వివరించారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు కలిగి ఉన్న విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ కోర్సులను జనాభా అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్లు స్పష్టం చేశారు. ఐటీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. నగరంలోని యూనివర్సిటీ హబ్‌తో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లింగంపల్లిలో చైన్‌స్నాచింగ్

3 తులాల బంగారు గొలుసు అపహరణ

హఫీజ్‌పేట్: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శివాజీనగర్‌లో నివాసముండే తులసి లక్ష్మి (28) సోమవారం గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో విధులు ముగించుకొని లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి శివాజీనగర్‌కు వస్తుండగా సిటిజన్ కాలనీ సమీపంలోకి రాగానే ఆమె పక్క నుంచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. దీంతో ఆమె చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం కాలనీలోని పరిసర ప్రాంతాలలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

టాస్క్‌ల పేరిట సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ల పేరిట ఓ వ్యక్తి రూ. 82 వేలు పోగొట్టుకోగా, మరో వ్యక్తి రూ.49 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓడీఎఫ్ కాలనీకి చెందిన డ్రైవర్‌కు ఏప్రిల్ 4వ తేదీ టాస్కులు పూర్తి చేస్తే, కమీషన్ ఇస్తామని వాట్సాప్‌కు లింకు రావడంతో దాన్ని క్లిక్ చేసి అతడి వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా పలు దపాలుగా రూ. 82 వేలు వేశాడు. అనంతరం పెట్టిన నగదుతో పాటు, కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ మెడికల్ షాప్ నిర్వాహకునికి ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే నగదు రెట్టింపు ఇస్తామని లింక్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి, పలు దఫాలుగా రూ. 49 వేలు వేశాడు.చివరికి బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల భద్రతా ఏర్పాట్ల పరిశీలన

రాంగోపాల్‌పేట్ : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు పోలీసులు భద్రతా ఏర్పాట్లు మొదలు పెట్టారు. జూలై 21,22వ తేదీల్లో జరుగనున్న బోనాలకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి ఏటా లక్షల మంది భక్తులు పాల్గొంటుండగా.. ఏటేటా ఆ సంఖ్య పెరుగుతూనే వస్తుంది. సోమవారం మహంకాళి ఈవో మనోహర్‌రెడ్డి, మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్‌లు దేవాలయ పరిసర ప్రాంతాల్లో తిరిగి భక్తుల భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. గతేడాది తలెత్తిన సమస్యలు, భక్తుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని తిరిగి పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడతామని ఏసీపీ, ఈవోలు తెలిపారు. భక్తులు, స్వచ్ఛంద సంస్థలు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు జాతర విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు.